క్లుప్తంగా

కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మ శాస్త్ర సన్నిధానం లో ఆదివారం రుద్ర సహిత నవచండీ పారాయణం, పూర్వక చండీయాగాన్ని అయ్యప్ప స్వాములు నిర్వహించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. సారేపల్లి గోవింద రావు గురుస్వామి, సూర్యనారాయణ స్వామి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో మార్మోగింది.

వాహన తనిఖీలు



వసుంధర చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మత్తు పదార్థాల రవాణా అరికట్టేందుకే తనిఖీలు నిర్వహిస్తున్నామని మెళియాపుట్టి ఎస్సై రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వసుంధర చెక్ పోస్టు వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, నిషేధిత మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టామన్నారు. అతివేగంగా, లైసెన్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారికి అపరాధ రుసుం విధించామన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

45 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సారవకోట: మండల కేంద్రంలో జై భీమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 45 మంది వృద్ధులకు శ్రీకాకుళంలోని శంకర్ ఫౌండేషన్ వైద్యుడు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందిని శస్త్ర చికిత్సల కోసం గుర్తించి శ్రీకాకుళం తరలించారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం, దళిత సంఘం నాయకులు సింహాచలం, కోడూరు కృష్ణమూర్తి, ఆనంద రావు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఫెసిలిటీ సెంటర్ పనులు



ప్లాట్ ఫాం నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో రూ.40 లక్షలతో మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు చేపడుతున్నామని మార్కెటింగ్‌శాఖ డీఈఈ కోటయ్య తెలిపారు. ఆదివారం ప్లాట్ ఫాం నిర్మాణం పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే రైతులు 500 మెట్రిక్ టన్నుల పంటలను స్టోరేజ్ చేసుకోవచ్చునని తెలిపారు.

రోడ్డుపై మట్టితో అవస్థలు



వెంకటాపురంలో సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న మట్టి పెల్లలు

సారవకోట: మండలంలోని పలు రోడ్లుపై ఉన్న మట్టి పెల్లలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నరసన్నపేట నుంచి ఒడిశాలోని మోహనకు వెళ్లే జాతీయ రహదారితోపాటు సారవకోట నుంచి కొత్తూరు మీదుగా బత్రి వెళ్లే రహదారులు పూర్తిగా మట్టి పెల్లలతో నిండిపోయాయి. ప్రస్తుతం యంత్రాలతో వరి కోతలు చేపడుతున్నారు. ఈ వరి కోత యంత్రాలతో పొలంలోని బురదతో రోడ్డుపైకి రావడం, ధాన్యంతో ట్రాక్టర్లు మట్టితో రావడంతో ఆ మట్టి పెల్లలు రోడ్లపై పడటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం చిన్న వర్షం పడినా రోడ్డు బురదమయంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత ఆందోళన





గోకర్ణపురం వద్ద కళ్లంలో ఆరబెట్టిన ధాన్యం

- అకాల వర్షాలతో రైతన్నకు కష్టాలు
- ఇటీవల ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో తడిసిన ధాన్యం
- కోలుకోక ముందే మళ్లీ తుఫాన్ హెచ్చరికలు
- కొన్నిచోట్ల కోతలు, కళ్లాల్లోనే ధాన్యం

మెళియాపుట్టి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రైతులు అవస్థలు పడ్డారు. కోసిన వరి పనలు పొలాల్లో నుంచి కళ్లాలకు చేర్చే క్రమంలో కొన్నిచోట్ల తడిసిపోయాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కుప్పలుగా వేసి టార్పాలిన్లతో కప్పి జాగ్రత్త చేసుకున్నారు. మళ్లీ తుఫాను ముప్పు పొంచి ఉందనే (ఈ నెల 9వ తేదీ నుంచి) వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఆదివారం మెళియాపుట్టి మండలంలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఇంకా కోతకు కొంతమేర వరి పంట ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నేల వాలిపోతే ధాన్యం తడిసి పాడైపోతుందని ఆవేదన చెందుతున్నారు. ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండటంతో విక్రయించేందుకు సమయం పడుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో కళ్లాల్లోనే ధాన్యం ఆరబెడతూ రైతులు తీరిక లేకుండా గడుపుతున్నారు. తేమ శాతం 17 వస్తేనే మద్దతు ధర వస్తుందని రైతులు చెబుతున్నారు.



పట్టుపురంలో నూర్పిడి చేస్తున్న రైతులు

ఇబ్బంది పడుతున్నాం



పంట చేతికి అందివచ్చిన సమయానికి అకాల వర్షాలు కురవడం రైతులకు శాపమే. తుఫాన్ రాకపోయుంటే ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకునేవాళ్లం. గత వారం రోజులు తుఫాన్, మబ్బులతోనే సరిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నాం. తేమ తగ్గితేనే మిల్లులకు తరలిస్తాం. లేకపోతే మద్దతు ధర దక్కదు. మరోరెండు రోజుల పాటు ఆరబెడతాం. మళ్లీ తుఫాన్ ఉందని చెబుతున్నారు. వర్షాలు పడితే చాలా నష్టపోతాం.

– బమ్మిడి నీలయ్య, రైతు, గోకర్ణపురం, మెళియాపుట్టి మండలం

గుబులుగానే ఉంటుంది



వరి పంట కోత దశలో వర్షాలెక్కువగా వస్తే నష్టం తీవ్రత అధికంగా ఉంటుంది. యంత్రంలో వరి కోయడానికి కూడా ఇబ్బంది పడతాం. కోతలు పూర్తయి ధాన్యం మిల్లులకు చేరేవరకు గుబులుగానే ఉంటుంది. మొన్నటి వర్షానికే అవస్థలు పడ్డాం. మళ్లీ వర్షాలు రాకూడదని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

– పద్దూరు భీమారావు, దీనబంధుపురం, మెళియాపుట్టి మండలం

పాతపట్నం నియోజకవర్గంలో వరి పంట (ఎకరాలు), పూర్తయిన కోతల వివరాలు (ఈ నెల 6వ తేదీ నాటికి) ఇలా..

మండలం	మెళియాపుట్టి	పాతపట్నం	హిరమండలం	కొత్తూరు	ఎల్.ఎన్.పేట
వరి పంట	7,741	8,699	3,364	10,374	4,464
కోతలు పూర్తయినవి	4,500	6,200	2,050	7,520	2,000

బాలి యాత్ర యూత్ ఫోర్స్ ఏర్పాటు



బాలి యాత్ర యూత్ ఫోర్స్ టీ షర్ట్‌లను ఆవిష్కరిస్తున్న జీవితేశ్వరరావు, తదితరులు

జలుమూరు: మన ప్రాచీన వైభవాన్ని భావితరాలకు అందించేందుకు, ఈ ఏడాది ఘనంగా నిర్వహించిన బాలి యాత్రను ప్రతీ ఏడాది నిర్వహించాలనే ఉద్దేశంతో శ్రీముఖలింగంలో బాలియాత్ర యూత్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు ఆదివారం తెలిపారు. బాలి యాత్ర యూత్ ఫోర్స్ టీ షర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. బాలి యాత్ర మన పూర్వీకుల నుంచి వచ్చిన గొప్ప సంపదన్నారు. నాటి కళింగ సీమలో భాగమైన ఒడిశాలో ఆనాటి ప్రాచీన సంప్రదాయాలు ఎన్నో అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో వాటిని విస్మరించడం జరిగిందన్నారు. వీటిని ముందుకు తీసుకువెళ్లేందుకు వందల ఏళ్ల నాటి ఈ యాత్రను ఈ ఏడాది కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శ్రీముఖలింగంలోని వంశధార నదీ తీరాన బాలి యాత్ర ఎంతో వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతీ ఏడాది ఈ యాత్ర నిర్వహించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఒడిశా మాదిరిగా ఏపీలో కూడా ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఇది కేవలం ఒక సామాజికవర్గానికి సంబంధించినది కాదని, నాటి కళింగ సీమ వైభవమన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ టి.సతీష్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కె.హరి ప్రసాద్, వైద్యుడు సంపతిరావు జగదీష్, బొడ్డేపల్లి నేతాజీ, బమ్మిడి సంతోష్‌కుమార్, కొత్తకోట శ్రీనివాసరావు, పైలా శ్రీనివాసరావు, పి.ఈశ్వరరావు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో పట్టుబడితే చర్యలు



మెళియాపుట్టి: వసుంధరలోని కిరాణా షాపులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



పాతపట్నం: ఆటోను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని స్థానిక ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని కొసమాల, వసుంధర మెళియాపుట్టిలోని పలు కిరాణా, పాన్ షాపులు, ఇతర ప్రదేశాల్లో గంజాయి, మత్తు పదార్థాలు గుర్తుపట్టడానికి ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, నిశేధిత మత్తుపదార్థాలు విక్రయిస్తే సమాచారం అందజేయాలని స్థానిక ప్రజలను కోరారు. సిబ్బంది మోజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు..

పాతపట్నం: ఒడిశా–ఆంధ్ర సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య ఆధ్వర్యంలో ఒడిశా నుంచి వచ్చే వాహనాలను డాగ్ స్క్వాడ్‌తో ఆదివారం తనిఖీలు చేపట్టారు. పాతపట్నం, కాగువాడ, కొరసవాడ గ్రామాల్లో కిరాణా దుకాణాల్లోనూ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

ఉలవ సాగుపై రైతుల ఆసక్తి



కొత్తగూడ గిరిజన గ్రామంలో ఉలవ సాగు

ఎల్.ఎన్.పేట: వాణిజ్య పంటల్లో ఒకటైన ఉలవ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో అంతంత మాత్రంగా సాగైన ఉలవ పంట విస్తీర్ణం ఈ ఏడాది పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో వంశధార నదీ తీర గ్రామాలకు చెందిన రైతులు పొలం, కాలువ, చెరువు గట్లతోపాటు నదీ తీరంలోని ఒండ్రు మట్టి దిబ్బలపైన ఉలవ పంట పండించేవారు. ఈ ఏడాది వంశధార నదీ తీరంలోని లక్ష్మీనర్సుపేట, వాడవలస, మిరియాపల్లి, బసవరాజుపేట, దబ్బపాడు గ్రామాలతోపాటు గిరిజన గ్రామాలైన గోలుకుప్ప, కొత్తగూడ, సరడాం, జోగివలస, బాలేరు, కొత్తజోగివలస తదితర ప్రాంతాల్లోనూ ఉలవ పంటను సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటగా ఉలవ పంటను వేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారి పైడి లతశ్రీ తెలిపారు. పదును ప్రకారం విత్తనాలు వేసుకుని ఒక నీటితడిని అందించినా, తెలిక పాటి వర్షం కురిసినా సరిపోతుందన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



లచ్చయ్యపేట వద్ద గోతులు కప్పుతున్న పోలీసులు

బూర్జ: మండలంలోని లచ్చయ్యపేట ప్రధాన రహదారిలో (శ్రీకాకుళం–పాలకొండ రోడ్డు) పెద్ద, పెద్ద గోతులను స్థానిక పోలీసులు ఆదివారం మట్టితో పూడ్చారు. ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక ఆదేశాల ప్రకారం రోడ్డు పక్కన ఉన్న గోతులను మట్టితో కప్పారు. వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు, ఇబ్బంది జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1990–93లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమేళనం ఏర్పాటు చేశారు. జమ్ము కూడలి వద్ద ఓ కల్యాణ మండపంలో వీరు కలిశారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకులను సత్కరించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సందడిగా గడిపారు. 30 ఏళ్ల తరువాత అందరూ ఒకచోట కలవడంతో కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలమల భాస్కరరావు, సుసరాపు శ్రీనివాసరావు, మెండ సత్యనారాయణ, ఎస్.లక్ష్మణమూర్తి, సదాశివుని శ్రీను, ప్రగడ వేణుగోపాలరావు, మాదిన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. – నరసన్నపేట

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



బూర్జ: యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవల్లిక

బూర్జ: యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక సూచించారు. మండలంలోని లచ్చయ్యపేటలో ఆదివారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. సత్ప్రవర్తనపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచిగా చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

ఆమదాలవలస: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసై నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆమదాలవలస ఎస్‌ఐ–2 సింహాచలం సూచించారు. మండలంలోని వెదుళ్లవలస గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలనలో..



సరుబుజ్జిలి మండలంలోని పలు సచివాలయాల నుంచి పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఇటీవల జరిగాయి. బదిలీలపై వెళ్లిన ఉద్యోగుల స్థానాల్లో కొత్తవారు చాలాచోట్ల బాధ్యతలు స్వీకరించలేదు. పురుషోత్తపురం, సరుబుజ్జిలి, విజయరాంపురం, ఇస్కలపాలెం సచివాలయాలకు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు నేటివరకు లేరు. పురుషోత్తపురానికి పెద్దపాలెం కార్యదర్శి, సరుబుజ్జిలికి చిగురువలస కార్యదర్శి, విజయరాంపురానికి గోనెపాడు కార్యదర్శి, ఇస్కలపాలెంకు ఎంఎస్‌పురం కార్యదర్శి ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జ్‌లపాలనలో ప్రగతి కుంటుపడుతుందని స్థానికులు అంటున్నారు. – సరుబుజ్జిలి

రక్షణ గోడలు నిర్మించాలి..



కొత్తూరు మండలం నివగాం నుంచి పాతపాడు రోడ్డు తంపర ప్రాంతం (కల్వర్టు) వద్ద ప్రమాదకరంగా ఉంది. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా గోడలు నిర్మించకపోవడంతో కోతకు గురై వెడల్పు తగ్గింది. వర్షాలు కురిసినప్పుడు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని పాతపాడు గ్రామానికి చెందిన ప్రజలు కోరుతున్నారు. – కొత్తూరు

గోతులమయం



గతకులు లేని రోడ్లే మా నినాదమని చెబుతున్న కూటమి నాయకులు గ్రామాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లను పట్టించుకోవడం లేదు. నరసన్నపేట మండలంలోని బాలసీమ రోడ్డులో అడుగడుగునా గోతులు దర్శనిమిస్తున్నాయి. బాలసీమ నుంచి బసివలస మధ్య మరింత అధ్వానంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బసివలసకు చెందిన ఓ వ్యక్తి కపరా బుగ్గి గోతుల్లో వేసినా కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి వచ్చింది. ఆర్అండ్‌బీ ఇంజినీర్లు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. – నరసన్నపేట

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని కాగువాడ ప్రాంతంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట. ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని కొరసవాడ, బూరగాం, కాపు గోపాలపురం, కాగువాడ, సీది, తీమర, తామర, ప్రహరాజపాలెం, చంగుడి తదితర గ్రామాల్లో (1,200 ఎకరాల్లో) మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు ఏఓ బి.రవికుమార్ తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మొక్కజొన్న పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. – పాతపట్నం

బంతి పూల సాగు.. లాభాలు బాగు



వీఎన్‌పురం కాలనీ సమీపంలో మల్లేశ్వరరావు వేసిన బంతి పూల సాగు

నరసన్నపేట: మండలంలోని వీఎన్‌పురం గ్రామానికి చెందిన రైతులు పంట మార్పిడి చేసి మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. మూసగా ఒకే పంట కాకుండా బంతి పువ్వుల సాగు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పెరిగిన ఖర్చులు, తగ్గిన ఆదాయంతో వరి పంటకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల్లో భాగంగా బంతిపూల సాగును ముద్దాడ మల్లేశ్వరరావు 80 సెంట్లు, ముద్దాడ జగ్గునాయుడు 30 సెంట్లలో చేపట్టారు. కేజీ బంతి పూలు బజారులో రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్‌గా అయితే వంద లోపే విక్రయాలు చేస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న మార్కెట్‌తోపాటు ఇతర ప్రాంతాలకు బంతిపూలను ఎగుమతి చేస్తున్నామన్నారు. విజయనగరం జిల్లా గొర్ల నుంచి బంతి నారు తీసుకువచ్చామని డ్రిప్ పద్ధతిలో నాటి నీరు అందిస్తున్నట్లు మల్లేశ్వరరావు తెలిపారు. 80 సెంట్ల విస్తీర్ణంలో రూ.80 వేల వరకు పెట్టుబడి అయిందని, మంచి ఆదాయం వచ్చిందన్నారు. కార్తీక మాసం, అయ్యప్ప మండపాల కారణంగా డిమాండ్ బాగుందన్నారు. ప్రస్తుతం వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు వరుసగా ఉండటంతో విక్రయాలు బాగుండే అవకాశం ఉందన్నారు. గతేడాదికంటే గిరాకీ బాగుందని జగ్గునాయుడు అన్నారు. పంట మార్పిడితో నేల సారవంతం అవుతుందని, ఎరువులు, ఇతర సస్యరక్షణ చర్యలు అంతంత మాత్రమేనని మల్లేశ్వరరావు అన్నారు. వచ్చే ఏడాది మరింతగా విస్తీర్ణం పెంచనున్నామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



మూతపడిన పాఠశాల



మూతపడిన పాఠశాల ఆవరణంలో పడి ఉన్న పేక ముక్కలు

కొత్తూరు: మండలంలోని నివగాం ఎస్సీ వీధి వద్ద ఉన్న పాఠశాల కొన్నేళ్ల క్రితం మూతపడింది. ప్రస్తుతం ఈ భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. గ్రామానికి శివారులో ఉన్నందున జూదం ఆడేందుకు, మద్యం సేవించడానికి కొంతమంది వినియోగిస్తున్నారు. ఆ సాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.